11లో



## గణనాథుడి సన్నిధిలో ఆనంద్ కుమార్ గౌడ్

- నగరంలోని పలు వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు..
ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థనలు

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట



ఆదివారం సెప్టెంబర్ 20, 2026 పేజీలు:12

# దేవరకద్ర అభివృద్ధికి మరో అడుగు

### - రూ.204 కోట్లకు పైగా రహదారులు, వంతెనల పనులకు శ్రీకారం
### - మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పర్యటన.. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

**మహబూబ్ నగర్, సెప్టెంబర్ 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** దేవరకద్ర నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడనుంది. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సెప్టెంబర్ 20న నియోజకవర్గంలో పర్యటించి రూ.204 కోట్లకు పైగా విలువైన రహదారులు, వంతెనల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు పూర్తయిన వంతెనను ప్రారంభించనున్నారు. ఉదయం 10 గంటలకు దేవరకద్ర పురపాలక సంఘం పరిధిలోని మీనుగోనిపల్లి వద్ద రూ.158.36 కోట్లతో చేపట్టనున్న హెచ్‌ఏఎం రహదారి పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ రహదారి పనులతో నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడడంతో పాటు గ్రామీణ ప్రాంతాల మధ్య అనుసంధానం బలోపేతం కానుంది.అనంతరం ఉదయం 11 గంటలకు కౌకుంట్ల మండలం ముచ్చింతల గ్రామంలో ఫర్దీపూర్‌ముచ్చింతల మధ్య ఒకచెట్టు వాగుపై రూ.40 కోట్లతో నిర్మించనున్న హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. వర్షాకాలంలో వాగు కారణంగా రాకపోకలకు ఎదురయ్యే ఇబ్బందులు తగ్గడంతో పాటు ఆయా గ్రామాల మధ్య ప్రయాణ సౌకర్యం మెరుగుపడనుంది. మధ్యాహ్నం 12 గంటలకు కురుమూర్తి స్వామి ఆలయ ఘాట్‌రోడ్డు పనులను మంత్రి, ఎమ్మెల్యే పరిశీలించనున్నారు. ఘాట్‌రోడ్డు అభివృద్ధితో కురుమూర్తి ఆలయానికి వచ్చే భక్తులు, పర్యాటకులకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఒంటిగంటకు మదనాపూర్‌ఆత్మకూర్ మధ్య ఒకచెట్టు వాగుపై రూ.6 కోట్లతో నిర్మించిన హై లెవల్ బ్రిడ్జిని మంత్రి ప్రారంభించనున్నారు. ఈ వంతెన అందుబాటులోకి రావడంతో ఆయా ప్రాంతాల ప్రజలకు రాకపోకలు సులభతరం కానున్నాయి.

**అభివృద్ధి పనులకు ప్రాధాన్యం:**

దేవరకద్ర నియోజకవర్గంలో గత వెయ్యి రోజుల కాలంలో రూ.1,034 కోట్లకు పైగా అభివృద్ధి, సంక్షేమ నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. రహదారులు, వంతెనలు, సాగునీరు, విద్య, వైద్యం, విద్యుత్,



తాగునీరు తదితర రంగాల్లో చేపడుతున్న పనులతో నియోజకవర్గ మౌలిక వసతులను మెరుగుపరిచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పర్యటనలో భాగంగా చేపట్టనున్న రహదారులు, వంతెనల పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల అనుసంధానం మరింత మెరుగుపడనుంది. ముఖ్యంగా వాగులపై వంతెనల నిర్మాణంతో వర్షాకాలంలో రాకపోకలకు ఎదురయ్యే ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది.నియోజకవర్గ అభివృద్ధిలో మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇస్తూ చేపడుతున్న పనుల్లో భాగంగా మంత్రి పర్యటనను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# బ్రహ్మోస్‌తో దేవరకద్రకు అభివృద్ధి బూస్ట్!

## - రైతులకు న్యాయమైన పరిహారం.. స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

## - భూసేకరణపై రైతులతో నెగోషియేషన్ కమిటీ సమావేశం



**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రతిష్టాత్మకమైన బ్రహ్మోస్ క్షిపణి ప్రాజెక్ట్ దేవరకద్ర నియోజకవర్గానికి రావడం ఈ ప్రాంత అభివృద్ధిలో కీలక మలుపు కానుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. ప్రాజెక్ట్ ఏర్పాటుతో పారిశ్రామిక అభివృద్ధితో పాటు స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. శనివారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సమక్షంలో బసవాయిపల్లి, చౌదర్పల్లి, జినుగురాళ్ల గ్రామాలకు చెందిన రైతులతో భూసేకరణ నెగోషియేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రైతులతో నేరుగా చర్చించి భూముల ధర, పరిహారం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, భూసేకరణపై వారి అభిప్రాయాలు, అభ్యంతరాలు, సూచనలు తెలుసుకున్నారు.

**ఎకరాకు రూ.20 లక్షల వరకు పరిహారం:**

భూసేకరణకు సంబంధించి రైతులకు ఎకరాకు రూ. 20 లక్షల వరకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. భూములు కోల్పోతున్న రైతుల కుటుంబాలతో పాటు స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యత కల్పించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. భూమి పరిహారంతో పాటు ఆయా భూముల్లో ఉన్న బోర్లు, చెట్లు, షెడ్లు, కాంపౌండ్ గోడలు, ఇతర నిర్మాణాలను అధికారులు సర్వే చేసి, నిబంధనల ప్రకారం వాటికి అదనపు పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటారని ఎమ్మెల్యే వివరించారు.

**న్యాయమైన పరిహారం ఇవ్వాలి : రైతులు**

బ్రహ్మోస్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ తమ ప్రాంతానికి రావడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ ద్వారా ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. భూములు ఇచ్చేందుకు తాము సుముఖంగానే ఉన్నామని, అయితే తమ భూములకు న్యాయమైన పరిహారం అందించాలని అధికారులను కోరారు.

**75 శాతం మంది రైతుల సమ్మతి:**

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మార్కెట్ విలువకు అదనంగా పరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రైతుల అభ్యంతరాలు, సూచనలను పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరిస్తామని వెల్లడించారు. ఇప్పటికే సుమారు 75 శాతం మంది రైతులు భూసేకరణకు సమ్మతి తెలిపారని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ప్రతిపాదించిన పరిహారం, భూసేకరణ చట్టం ప్రకారం లభించే పరిహారం, ఇతర ప్రాంతాల్లో అమలైన పరిహారాలను పరిశీలించి రైతులు నిర్ణయం తీసుకోవాలని సూచించారు. భూసేకరణపై న్యాయపరమైన ప్రక్రియకు వెళితే ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉన్నందున, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రక్రియకు సహకరించాలని కలెక్టర్ రైతులను కోరారు. బ్రహ్మోస్ ప్రాజెక్ట్ ఏర్పాటుతో దేవరకద్ర ప్రాంతంలో పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధితో పాటు స్థానికంగా ఉద్యోగ, ఉపాధి, విద్యా అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. భూసేకరణ ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు రైతుల అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, ఆర్‌డీఓ నవీన్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు, గ్రామ సర్పంచులు, రైతులు, గ్రామస్తులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో రోగి సహాయకులకు అన్నప్రసాద పంపిణీ

## - 15 వందల మందికి అన్న ప్రసాద వితరణ

**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి)**

వినాయక చవితి గణేష్ ఉత్సవాల సందర్భంగా నాగర్ కర్నూలు ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన గణపతి స్వామికి ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించి,రోగి సహాయకులకు ఏర్పాటుచేసిన అన్న ప్రసాదం పంపిణీ కార్యక్రమా న్ని ఆర్.ఎం.ఓ.డాక్టర్ కె.ప్రశాంత్,నర్సింగ్ సూపర్డెంట్ సంగీత ప్రారంభించి, ఆస్పత్రికి వచ్చే రోగులు స్వామివారి కృపాకటాక్షాలతో త్వరితగతిన స్వస్థత చేకూరి ఆరోగ్యవంతులు కావడానికి స్వామివారు దయ చూపాలని కోరారు.వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వారు 15 వందల మందికి పైగా అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సాధరణఆసుపత్రి నర్సింగ్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# ఉత్తమ ఉపాధ్యాయురాలికి ఘన సన్మానం

**గండేడ్ :**

మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న లింగాయపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయురాలు పి. సంధ్యారాణిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. బీసీ విద్యార్థి సంఘం మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు దోమ వెంకటేష్ ఆధ్వర్యంలో స్వగ్రామమైన లింగాయపల్లిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మేడమ్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దోమ వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ యాదవ్, రామచంద్రారెడ్డి, గోపాల్, కృష్ణయ్య, చెన్నయ్య, వెంకటయ్య, దోమ అరుణ, గత్ప వర్షిణి తదితరులు పాల్గొన్నారు. వీరాంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం లింగాయపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బైసుపల్లి గ్రామంలో వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో కూడా దోమ వెంకటేష్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించి సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో దోమ వెంకటేష్, బాబు, గోపాల్, శ్రీను, గోపీకృష్ణ, అంజి, మైబు తదితరులు పాల్గొన్నారు.



# జూరాల నీళ్ల కోసం రోడ్డెక్కిన రైతులు కలెక్టర్ రావాల్సిందే!"

- జూరాల నీళ్ల కోసం రైతుల ఆందోళన

10 గ్రామాల రైతులతో కలెక్టరేట్ ముట్టడి

- ఫ్లైఓవర్ వద్ద ధర్నా

కలెక్టర్ స్వయంగా వచ్చి సమస్య పరిష్కరించాలంటూ రైతుల డిమాండ్

**గద్వాల ప్రజా జ్యోతి సెప్టెంబర్ 19:**

జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు సరైన సమయంలో విడుదల కాకపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ 10 గ్రామాలకు చెందిన రైతులు శనివారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో 2 గంటలుగా ఆందోళనకు దిగారు.ముందుగా కలెక్టరేట్‌ను ముట్టడించిన రైతులు అనంతరం ఫ్లైఓవర్ సమీపంలో బైఠాయించి ధర్నా నిర్వహించారు.జూరాల నుంచి తమ ప్రాంతాలకు సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నీటి విడుదలపై అధికారులు వెంటనే స్పందించి తమ సమస్యనుపరిష్కరించాలని డిమాండ్ చేశారు.సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన పరిష్కారం లభించలేదని రైతులు పేర్కొన్నారు.కలెక్టర్ స్వయంగా ధర్నా ప్రదేశానికి వచ్చి రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని రైతులు స్పష్టం చేశారు. సాగునీరు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రైతులు ధర్నా చేయడంతో వాహనాలు ట్రాఫిక్ తో రెండు గంటలుగా నిలిచిపోయింది.






# అయిజ విద్యుత్ సబ్ స్టేషన్ ను ముట్టడించిన ఏ క్లాస్ పురం దేవబండ రైతులు

**ఆలంపూర్ సెప్టెంబర్ 19(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**



జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఏక్లాస్ పురం, దేవబండ గ్రామాల రైతులు అయిజ పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ను శనివారం ముట్టడించారు. 24 గంటలు ఇవ్వాల్సిన కరెంటు 7 గంటలు మాత్రమే ఇస్తున్నారని, దీంతో ఉన్న పంటలు కూడా ఎండిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయంపై స్థానిక ఎలక్ట్రికల్ ఏఈ చెన్నయ్య స్పందిస్తూ.. పై నుండి వచ్చిన ఆదేశాల మేరకు రైతులకు రావాల్సిన 10 గంటల విద్యుత్‌ను పూర్తిగా అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కురువ నాగన్న, మాజీ సర్పంచ్ కోడెల తిమ్మప్ప, వార్డు మెంబర్లు, రైతులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా కొత్తగా రూపకల్పన

- సెప్టెంబర్ 28 నుంచి దరఖాస్తుల స్వీకరణ.. నవంబర్ 6 వరకు గడువు

- నవంబర్ 25న ముసాయిదా జాబితా.. డిసెంబర్ 30న తుది జాబితా

**గద్వాల సెప్టెంబర్ 19(ప్రజా జ్యోతి ప్రతినిధి)**



:మహబూబ్‌నగర్‌రంగారెడ్డిహైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి ఓటర్ల జాబితాను కొత్తగా రూపొందించనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.2027 మార్చిలో ఈ ఎమ్మెల్సీ స్థానం ఖాళీ కానున్న నేపథ్యంలో,భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియను ప్రారంభించినట్లు పేర్కొన్నారు.సెప్టెంబర్ 28న ప్రజా ప్రకటన జారీ చేయనున్నట్లు తెలిపారు.అనంతరం అక్టోబర్ 15,25 తేదీల్లో వార్తాపత్రికల్లో ప్రజా ప్రకటనను పునఃప్రచురించనున్నట్లు వెల్లడించారు.అర్హత కలిగిన పట్టభద్రుల నుంచి సెప్టెంబర్ 28 నుంచి నవంబర్ 6,2026 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.నవంబర్ 25,2026న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించి,క్లెయిమ్‌లు,అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం డిసెంబర్ 30,2026న తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈసారి ఓటర్ల జాబితాను డీనోవో పద్ధతిలో కొత్తగా రూపొందిస్తున్నందున,గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదైన వారు సైతం తప్పనిసరిగా కొత్తగా ఫారం18 దరఖాస్తు సమర్పించి నమోదు చేసుకోవాలని సూచించారు.అర్హత కలిగిన పట్టభద్రులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.ఫారం18లో ఆధార్ నంబర్ నమోదు చేయడం తప్పనిసరి కాదని,అది పూర్తిగా స్వచ్ఛందమని కలెక్టర్ స్పష్టం చేశారు.ఆధార్ నంబర్ ఇవ్వలేదనే కారణంతో దరఖాస్తును తిరస్కరించరాదని అధికారులను ఆదేశించారు.ఆధార్ వివరాల గోప్యతను కాపాడుతూ,నిబంధనల ప్రకారం వాటిని భద్రపరచాలని సూచించారు.ఓటర్ల జాబితా తయారీకి సంబంధించిన తేదీలు,విధానం,అర్హతలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

# సీసీ రోడ్డు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

అభివృద్ధికి మరో ముందడుగు  కట్టకింద తిమ్మప్ప స్వామి ఆలయానికి సీసీ రోడ్డు

కట్టకింద తిమ్మప్ప స్వామివారిని దర్శించుకుని, ఆలయానికి సీసీ రోడ్డు నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**ఆలంపూర్ సెప్టెంబర్ 19(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

ఏఐసీసీ కార్యదర్శి, ఛత్తీస్‌గఢ్ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే డా. ఎస్.ఏ. సంపత్ కుమార్  రిక్వెస్ట్ మేరకు పార్లమెంట్ సభ్యులు  మల్లు రవి  సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు సాంక్షన్ చేయించడం అభినందనీయశీ అలాగేకాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావల్లి ఆచారి  ఈకార్యక్రమంలో  పాల్గొని, ఆలయ అభివృద్ధి మరియు ప్రజల సౌకర్యం కోసం చేపడుతున్న ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు అదేవిధంగాలిసింగిల్ విండో చైర్మన్ పోతుల మధుసూదన్ రెడ్డి  కూడా పాల్గొని భూమి పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేశారుకట్టకింద తిమ్మప్ప స్వామివారి ఆశీస్సులతో అయిజ మరింత అభివృద్ధి చెందాలని వారు అన్నారు అదేవిధంగాప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ అయిజ పట్టణ ప్రగతికి కాంగ్రెస్ నాయకత్వం కృషి చేస్తోంది నాయకులు అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ మహబూబ్ పాషా, కౌన్సిలర్లు చిన్నికృష్ణ, ఎస్. మద్దిలేటి, మైనర్ బాబు, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు డాన్ వీరన్న, మాజీ కౌన్సిలర్లు బోయ లక్ష్మన్న, కాజా, ఎస్సీఎస్టీ మానిటరింగ్ కమిషన్ సభ్యులు మాల మల్లికార్జున్, 14వ వార్డు ఇంచార్జ్ మేస్త్రి శీను, 1వ వార్డు ఇంచార్జ్ తెలుగు తాయప్ప, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉప్పరి బస్వరాజ్, పణంపల్లి రాములు, పెద్ద కృష్ణ, రామంజి, నరసింహ, దేవబండ లక్ష్మన్న, తుప్పత్రాల పాండు, మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ షాలు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు అడ్వకేట్ కురువ వీరేష్ తదితరులు పాల్గొన్నారులి



# విద్యార్థుల ప్రగతికి తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమన్వయం అవసరం






**మల్దకల్ సెప్టెంబర్ 19(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్దకల్‌లో నేడు తల్లిదండ్రులుఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతి,హాజరు,అభ్యసన సామర్థ్యం,ప్రవర్తన,క్రమశిక్షణ తదితర అంశాలపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపరిచేందుకు పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక బోధనా కార్యక్రమాలు, అదనపు తరగతులు,హోంవర్క్,పరీక్షల సన్నద్ధత వంటి అంశాలను తల్లిదండ్రులకు వివరించారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ,ఇంటి వద్ద కూడా విద్యార్థులు ప్రతిరోజూ నిర్దిష్ట సమయం చదువుకునేలా తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు. విద్యార్థుల పురోగతిని తెలుసుకునేందుకు తల్లిదండ్రులు తరచూ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో సంప్రదింపులు జరపాలని,పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులు సూచించారు. విద్యార్థుల్లో మంచి అలవాట్లు,క్రమశిక్షణ,సమయపాలన పెంపొందించడంలో పాఠశాలతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతిపై తల్లిదండ్రుల అభిప్రాయాలను తెలుసుకుని,వారి సూచనలను స్వీకరించారు. పాఠశాలతల్లిదండ్రుల సమన్వయంతో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జి.సురేష్,ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# సమస్యలకు నిలయం అయిజ బస్టాండు

## ఏటా కేవలం అద్దే రూపేణా (70షాప్స్) 2.50 కోట్లు

## నిత్యం 102 బస్సులు రాకపోకలు కనీసం

## హోటల్,మంచినీరు,టాయిలెట్స్,జజ కెమరాలు, జజ రోడ్ కూడా లేవు

**ఆలంపూర్ సెప్టెంబర్ 19(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**



అయిజ పట్టణ అధ్యక్షులు తెలుగు నరసింహ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం కు విచ్చేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.అయిజ బస్టాండ్ పలు సమస్యలతో విలయమాడుతుంది ముఖ్యంగా గత మూడు సంవత్సరాల నుంచి ఈ బస్టాండ్ కు 3 కోట్ల రూపాయలు నిధులు ఇచ్చి అత్యాధునిక బస్టాండ్ నిర్మించాలని పలుమార్లు బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం జరిగింది కానీ కేవలం 40 లక్షల రూపాయలు మాత్రమే ఇవ్వడం జరిగింది ఇది ఏ మూలన సరిపోవు పనులు కూడా నాణ్యత లోబహిష్టంగా ఉన్నాయి.ముఖ్యంగా డిపో మేజర్, రీజినల్ మేనేజర కి మా పార్టీ తరుపున డిమాండ్ చేయడమేమంటే ఈ యొక్క బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీకి సంబంధించి 70 సెటర్లకు పైగా షాపింగ్ కాంప్లెక్స్ పై ఉన్నాయి ఏటా 2.50 కోట్ల అద్దె వస్తుంది అదేవిధంగా ప్రతిరోజు వివిధ రాష్ట్రాలకు ఈ బస్టాండ్ నుండి 102 బస్సులు వచ్చిపోతున్నాయి మరి ఎలాంటి వసతులు లేవు కనీసం టాయిలెట్స్ కూడా సరిగా లేవు హోటల్ లేకపోవడం వల్ల ప్రయాణికులు బయట వెళ్లి టిఫిన్లు టీలు భోజనాలు చేసి రా వచ్చే లోపల బస్సు ఉంటదో పోతుందని చాలామంది ఆందోళన పడుతున్నారు అదేవిధంగా కనీసం మంచినీటి సౌకర్యం లేదు బస్టాండ్లో కనీసం సీసీ కెమెరాలు కూడా లేవు మా డిమాండ్ ఒకటే ఈ బస్టాండ్ 40 సంవత్సరాల క్రితం నిర్మించినారు దీన్ని పూర్తిగా తీసి నూతన బస్టాండ్ నిర్మాణం చేసి ఇది సెంటర్ లో ఉంది సెంటర్లో కాకుండా ఒకవైపు నిర్మించి నూతనంగా నిర్మించాలని ఎందుకంటే సెంటర్లో ఉండడం వల్ల చాలా ఇబ్బంది అవుతుంది. దీన్ని నూతనంగా ఒకవైపు నిర్మించి అదే విధంగా అత్యాధునిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఇంత ఆదాయం ఉన్నటువంటి బస్టాండ్ ఎక్కడ లేదు కాబట్టి వెంటనే మేము ఇచ్చినటువంటి ప్రతి డిమాండ్ నెరవేర్చాలని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమం లో అయిజ మండల అధ్యక్షులు ,గోపాలకృష్ణ,నాయకులు కంపాటి భగత్ రెడ్డి,లక్ష్మణ్ గౌడ్, తూముకుంట అంజి,ప్రతీప్,లవకుశ,రజక నర్సింహా,శ్రీకాంత్,జగన్,రామంజి తదితరులు పాలుగొన్నారుడ

# మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డికి పితృవియోగం

### - మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ని పరామర్శించిన కేటీఆర్ ...

### - బీరం లక్ష్మారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన కేటీఆర్

**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

పితృ వియోగం లో ఉన్న కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్ష వర్ధన్ రెడ్డి ని వారి కుటుంబ సభ్యులను భారత రాష్ట్ర సమితి( బి ఆర్ ఎస్) పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం మాజీ మంత్రులు, నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలతో  కలిసి పరామర్శించారు.కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి (87) తెల్లవారుజామున  అనారోగ్య కారణాలతో మరణించిన విషయం విధితమే.. కాగా అంత్యక్రియలను శుక్రవారం కొల్లాపూర్ అసెంబ్లీ నియోజక వర్గం లోని ఎత్తం గ్రామ శివారులో ఉన్న వారి వ్యవసాయ క్షేత్రం లో నిర్వహించారు. లక్ష్మారెడ్డి అంత్యక్రియలకార్యక్రమానికి  కేటీఆర్ వస్తున్నారని బి ఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రచారం చేసినప్పటికీ కేటీఆర్ శుక్రవారం అనివార్య కారణాల వల్ల  లక్ష్మారెడ్డి అంత్యక్రియలో పాల్గొన లేక పోయారు.  శనివారం  ఉదయం బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీఆర్ ఎత్తం గ్రామ శివారులో ఉన్న కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి  వ్యవసాయ క్షేత్రానికి సందర్శించి, మాజీ మంత్రులతో కలిసి మృతుడు లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలు వేసి ఘనంగా  నివాళులు అర్పించారు. పితృ వియోగం లో ఉన్న హర్షవర్ధన్ రెడ్డి ని కేటీఆర్ ఆలింగనము చేసుకుంటూ, వారి  కుటుంబ సభ్యులను కేటీఆర్ పరామర్శించి లక్ష్మారెడ్డి మృతి కి సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇచ్చారు. ఇదిలా ఉండగా  హర్షవర్ధన్ రెడ్డిని పరామర్శించడానికి వారి వ్యవసాయ క్షేత్రానికి కేటీఆర్ రావడం తో అక్కడ వేచి ఉన్న బి ఆర్ఎస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు జై కేసి ఆర్, జై జై కేటీఆర్ కాబోయే ముఖ్యమంత్రి కేటీఆర్ అంటూ నినాదాలు చేశారు.బీరం హర్షవర్ధన్ రెడ్డి నీ పరామర్శించడానికి వచ్చిన కేటీఆర్ వెంట  మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్. ఎస్ ప్రవీణ్ కుమార్, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, ఆశన్నగారి జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. మృతి చెందిన బీరం లక్ష్మారెడ్డి, కొల్లాపూర్ నియోజక వర్గంలో సింగల్ విండో ప్రెసిడెంట్ గా పలుమార్లు విధులు నిర్వహించి, రైతుల పక్షపాతిగా నిలిచారని రైతులు శ్రేయోభిలాషులు బోరున విలవించారు. అనంతరం కేటీఆర్ చిన్నంబావి మండల కేంద్రం లో ఉన్న బి ఆర్ఎస్ పార్టీ  రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్ రావు స్వగృహానికి కేటీఆర్ తరలి వెళ్లారు. అక్కడ కొద్దిసేపు పార్టీ సమస్యలపై చర్చించి, సిటీకి తరలి వెళ్లారు.





## గణనాథుని ఆశీస్సులతో ఏలినోవా ప్రభావం ఉండకూడదు

### ఏ ఆర్  ఎస్సై హరీష్ చారి

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.**

విఘ్నేశ్వరుని ఆశీస్సులతో రాష్ట్రవ్యాప్తంగా ఎలినోవా ప్రభావం ఉండకూడదని ప్రత్యేక పూజలు నిర్వహించి ఏ ఆర్ ఎస్ఐ హరీష్ కుమార్ చారి కోరారు. మండల కేంద్రానికి చెందిన ఫస్ట్ వార్డ్ మెంబర్ సుబ్రహ్మణ్య చారి తనయుడు గణనాథుని ప్రత్యేక పూజ కార్యక్రమాన్ని శనివారం రోజు  పాల్గొన్నారు. అనంతరం ఐదు వందల మందికి స్వచ్ఛందంగా అన్నదాన కార్యక్రమాన్ని వారి కుటుంబ సభ్యులతో నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్సై హరీష్ మాట్లాడుతూ గణనాథుని పూజల వలన వర్షాలు కురుస్తాలని గ్రామాలలో రైతులు సంతోషంగా ఉండాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో ప్రముఖ  వక్తలు గ్రామ ప్రజలు మహిళలు పాల్గొన్నారు



## ఈనెల 21 తేదీన కళ్యాణ లక్ష్మి & షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్న

### ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు  విజయుడు

**ఆలంపూర్ సెప్టెంబర్ 19(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో అలంపూర్ ౘ రోడ్డు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు ఈనెల 21వ తేదీన సోమవారం ఉదయం 10 గంటల నుంచి అయిజ మున్సిపాలిటీకి మరియు అయిజ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కళ్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేయనున్న ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు ,కాబట్టి ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి అయిజ మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్స్, బి ఆర్ ఎస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్,వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పిటిసిలు, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు హాజరు కాగలరని మనవి,



# న్యాయవాదులు నిత్య విద్యార్థులే

## - చట్టాల్లో మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

న్యాయవాదులు నిత్య విద్యార్థులని, చట్టాల్లో వస్తున్న మార్పులు, నూతన న్యాయ అంశాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత అన్నారు. పాలమూరు యూనివర్సిటీ లా కళాశాల ఆధ్వర్యంలో శనివారం అకాడమిక్ ఆడిటోరియంలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం విద్యార్థుల కోసం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ జి.ఎన్. శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్‌బాబు, ఉస్మానియా యూనివర్సిటీ లా డీన్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, బీఓఎస్ చైర్మన్ ప్రొఫెసర్ రాంప్రసాద్‌లతో కలిసి మూట్ కోర్టు, లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎన్. ప్రేమలత మాట్లాడుతూ మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ వంటి ప్రముఖులు న్యాయశాస్త్రాన్ని అభ్యసించి సమాజానికి విశేష సేవలు అందించారని గుర్తుచేశారు. విద్యార్థులు వారిని ఆదర్శంగా తీసుకుని న్యాయశాస్త్రంపై పట్టు సాధించాలని సూచించారు. లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల ద్వారా పేదలు, అణగారిన వర్గాలకు న్యాయ సహాయం అందించాలని ఆమె సూచించారు. ఎస్సీ, ఎస్టీలు, మహిళలు, వలస కార్మికులు, సీనియర్ సిటిజన్లు ఎదుర్కొంటున్న సమస్యలపై న్యాయ విద్యార్థులు ప్రత్యేక అవగాహన పెంచుకోవాలన్నారు. భవిష్యత్ న్యాయవాదులు క్లయింట్ల నుంచి పూర్తి వివరాలను సేకరించి, కేసులను సమగ్రంగా అధ్యయనం చేసిన అనంతరం ఆధారాలతో కూడిన వాదనలు వినిపించాలని సూచించారు. సివిల్, క్రిమినల్, యాక్సిడెంట్ తదితర అన్ని రకాల కేసులను అధ్యయనం చేయడంతో పాటు ఆర్గ్యుమెంటేషన్, డ్రాఫ్టింగ్, భాషపై పట్టు సాధించేందుకు నిరంతరం సాధన చేయాలని అన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్‌అదాలత్‌ల ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. న్యాయ విద్యార్థులు భవిష్యత్‌లో కోర్టు ప్రొసీడింగ్స్, కోర్టు వాతావరణం, న్యాయవాద వృత్తి విధానాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఏఐబీఈలో ఉత్తీర్ణత సాధించి వృత్తిలోకి అడుగుపెట్టేలా విద్యార్థులు సిద్ధం కావాలని అన్నారు. న్యాయ వృత్తిలో నైతిక విలువలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, తార్కిక ఆలోచనతో, చట్టపరమైన ఆధారాలతో వాదనలు వినిపించాలని సూచించారు. నిర్మాణాత్మక విమర్శలను స్వీకరిస్తూ వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు.

**పేదలకు న్యాయం అందించడమే న్యాయవృత్తి ధర్మం:**

పీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ జి.ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలు, సామాన్య ప్రజలకు న్యాయం అందించడమే న్యాయవృత్తి ప్రధాన ధర్మమని అన్నారు. ఈ సందర్భంగా అతిథులతో కలిసి 'లీగల్ ఎడ్యుకేషన్ అబ్జర్వెన్స్' క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. న్యాయ విద్య కేవలం పుస్తకాలు, చట్టాల అధ్యయనానికే పరిమితం కాకుండా సమాజంలోని వాస్తవ సమస్యలను అర్థం చేసుకునేలా ఉండాలని అన్నారు. బలహీన వర్గాలు, పేదలు, మహిళలకు న్యాయం అందించడంలో భవిష్యత్ న్యాయవాదులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. విద్యార్థులు మూట్ కోర్టులు, లీగల్ ఎయిడ్ కార్యక్రమాలు, సెమినార్లు, కాన్ఫరెన్సులు, వర్క్‌షాప్‌లలో చురుకుగా పాల్గొని ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. చట్టాల్లో వస్తున్న మార్పులు, సమాజంలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై నిరంతరం అవగాహన పెంచుకోవాలన్నారు. ఇలాంటి విద్యా, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు యూనివర్సిటీ తరఫున అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తామని వైస్‌చాన్స్‌లర్ తెలిపారు. లా కళాశాల హాస్టల్ నిర్మాణ పనులు త్వరలో పూర్తవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రకిరణ్, డీన్ వెంకటేశ్వర్లు, ఓయూ బీఓఎస్ చైర్మన్ రాంప్రసాద్, లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భూమయ్య, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది వై. రవికుమార్ యాదవ్, విభాగాధిపతి వెంకట సాయిప్రసాద్, అధ్యాపకులు కిరణ్, శ్రీకాంత్, ప్రియాంక, అశోక్, అక్షయ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా అన్నదానం

**గద్వాల సెప్టెంబర్ 19(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద శనివారం అన్నదాన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బంది,మీడియా ప్రతినిధులు,ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,వినాయక చవితి పండుగను ప్రజలందరూ సామరస్యంతో,శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. సమాజంలో శ్రేయస్సు,సౌభ్రాతృత్వం వెల్లివిరిసేలా భక్తి కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలను కూడా కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.శంకర్,గద్వాల డీఎస్పీ వై.మొగిలయ్య,డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ టాటా బాబు,గద్వాల సీఐ శ్రీను,అలంపూర్ సీఐ వి.ప్రదీప్,ఆర్ఐలు నరేష్,వెంకటేష్,హరీఫ్,ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు,మీడియా ప్రతినిధులు,పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘుపతి నాయుడు,పోలీసు సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు.



# పాలమూరు నీటి హక్కులపై జేఏసీ ఆందోళన

## - డిండి పనులను నిలిపివేయాలని డిమాండ్.. ఈ నెల 27న

## ఉల్పరబొట్టెముక్కల వరకు పాదయాత్ర

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

డిండి ఎత్తిపోతల పథకం పేరుతో పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన నీటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఉమ్మడి పాలమూరు జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ ఆరోపించింది. డిండి పనులను నిలిపివేసి, పాలమూరు పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేసింది. జేఏసీ నాయకుల వివరాల ప్రకారం, ఉల్పర, సింగరాజుపల్లి ప్రాంతాల్లో కాలువ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, గొట్టిముక్కల వద్ద పనులు 70 శాతానికి పైగా పూర్తయ్యాయని తెలిపారు. భూసేకరణలో పరిహారం విషయంలో రైతులకు అన్యాయం జరుగుతోందని వారు ఆరోపించారు. డిండి ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక ప్రాజెక్టు వివరాల్లో ఉల్పర బ్యారేజీ నుంచి శివన్నగూడెం రిజర్వాయర్ వరకు 66.3 కిలోమీటర్ల ప్రధాన కాలువను ప్రతిపాదించినట్లు, సింగరాజుపల్లి, గొట్టిముక్కల తదితర రిజర్వాయర్లు ప్రాజెక్టులో భాగంగా ఉన్నట్లు ప్రభుత్వ నీటిపారుదల శాఖ పత్రం పేర్కొంటోంది. అయితే, డిండి ప్రాజెక్టు వల్ల పాలమూరు ప్రాంత ప్రయోజనాలకు నష్టం జరుగుతుందన్నది జేఏసీ వాదన కాగా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం డిండి సహా ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు సాధించి పనులను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నట్లు అధికారికంగా తెలిపింది. ఈ నేపథ్యంలో డిండి లిఫ్ట్ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 27న ఉల్పర నుంచి గొట్టిముక్కల వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు జేఏసీ ప్రకటించింది. మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల రైతులు, ప్రజలు, విద్యార్థులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని జేఏసీ పిలుపునిచ్చింది. గత సెప్టెంబర్ 12న కూడా డిండి ప్రాజెక్టును రద్దు చేయాలని, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్‌లో సత్యాగ్రహ దీక్ష నిర్వహించినట్లు జెఏసి ప్రకటించింది.



# కలెక్టర్ బంగ్లాలో అన్నదాన కార్యక్రమం

## - వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు

## నిర్వహించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మహబూబ్‌నగర్ కలెక్టర్ బంగ్లా ఆవరణలో శనివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు. అంతకుముందు బంగ్లా ఆవరణలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు వినాయక చవితి వేడుకలను సుఖసంతోషాలతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం జిల్లా యంత్రాంగం అన్ని అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసిందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, బాధ్యతాయుతంగా నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రజలు, ఉత్సవ కమిటీలు అధికారులకు సహకరిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎ. శ్రీనివాసులు, ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**



గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను మరింత అభివృద్ధి చేసి, ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చైర్‌పర్సన్ ఖుష్బూ గుప్తా అన్నారు.ఖేలో ఇండియా గ్రామీణ ఖో-ఖో కార్యక్రమంలో భాగంగా పెద్దదిరాళ్ల గ్రామంలో 16, 17 తేదీల్లో నిర్వహించిన ఖో-ఖో పోటీల్లో సుమారు 400 మంది బాలురు, బాలికలు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో బాలురు, బాలికల జిల్లా స్థాయి జట్లను ఎంపిక చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను కలెక్టర్ అభినందించారు. గ్రామీణ క్రీడాకారులకు అవసరమైన క్యారం, చెస్ బోర్డులు, వాలీబాల్స్, వాలీబాల్ పోల్స్ తదితర క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి జె. రాజశేఖర్ రెడ్డి, కోచ్‌లు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతితో పర్యావరణ పరిరక్షణకు మంచి సందేశం

## - నిమజ్జనానికి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం తరఫున అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీలు అధికారులకు సహకరించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఆమె కోరారు. శనివారం తెలంగాణ చౌరస్తా సమీపంలోని శ్రీ గణేష్ భవన్‌లో మహబూబ్‌నగర్ జిల్లా గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన మట్టి గణపతి విగ్రహానికి కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా మట్టి గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం అభినందనీయమన్నారు. మట్టి గణపతిని ఏర్పాటు చేయడం ద్వారా గణేష్ ఉత్సవ సమితి ప్రజలకు మంచి సందేశాన్ని అందించిందని, ఇది ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

### చిన్న విగ్రహాలకు మూడు కృత్రిమ బేబీ కుంటలు:

మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థ పరిధిలో 5 అడుగుల లోపు విగ్రహాల నిమజ్జనం కోసం మూడు కృత్రిమ బేబీ కుంటలను ఇప్పటికే అందుబాటులోకి తీసుకువచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.అప్పన్నపల్లి సమీపంలోని మయూరి పార్క్ ఎదురుగా గంగోస్కుంట వద్ద రెండు, పంచవటి పాఠశాల సమీపంలోని పార్క్ వద్ద ఒక కృత్రిమ బేబీ కుంటను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

### పెద్ద విగ్రహాలకు బీచుపల్లి వద్ద ఏర్పాట్లు:

పెద్ద గణపతి విగ్రహాల నిమజ్జనానికి కూడా అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ అంశంపై గణేష్ ఉత్సవ సమితి సభ్యులతో చర్చించినట్లు చెప్పారు. బీచుపల్లి వద్ద నిమజ్జనానికి అవసరమైన నీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.అవసరమైన ఏర్పాట్లపై గద్వాల జిల్లా కలెక్టర్‌తో కూడా మాట్లాడి సమన్వయం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి:

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని కలెక్టర్ కోరారు. నిమజ్జన కార్యక్రమంలో ప్రజలు, ఉత్సవ కమిటీలు, అధికారులు పరస్పరం సమన్వయంతో వ్యవహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చూడాలని సూచించారు. ప్రజల సహకారంతోనే జిల్లాలో గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్న కలెక్టర్, నిమజ్జన సమయంలోనూ ప్రజలు అధికారులకు సహకరించి జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గణేష్ ఉత్సవ సమితి సభ్యులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత తహసీల్దార్లతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణేష్ ఉత్సవ సమితి, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి, కార్యదర్శి ఎం. బాలయ్య, సహాయ కార్యదర్శి లక్ష్మణ్, వి.హెచ్.పి. నగర అధ్యక్షుడు రెబ్బ విఘ్నేష్, సభ్యులు చేపల హనుమంతు, రాములు, మాల్యాద్రి, కార్పొరేటర్లు ప్రవీణ్ కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# 12 ఏళ్లుగా కొనసాగుతున్న కార్యవర్గానికి ముగింపు?

- ఈ నెల 28న రేషన్ డీలర్ల జిల్లా సమావేశం

- నూతన కమిటీ ఏర్పాటు.. డీలర్ల సమస్యలపై విస్తృత చర్చ

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**



జిల్లా రేషన్ డీలర్ల సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసేందుకు ఈ నెల 28న జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కానుందని పేర్కొన్నారు.సాధారణంగా రేషన్ డీలర్ల సంఘం కార్యవర్గానికి మూడేళ్ల కాలపరిమితి ఉన్నప్పటికీ, ప్రస్తుత కార్యవర్గం సుమారు 12 ఏళ్లుగా కొనసాగుతోందని నాయకులు తెలిపారు. కాలానుగుణంగా నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవడంతో పాటు, డీలర్ల సమస్యలను మరింత సమర్థవంతంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో నూతన జిల్లా కార్యవర్గం ఏర్పాటుతో పాటు రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్ అంశాలు, హక్కులు, సంక్షేమం, ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రయోజనాలు తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. మండలాల వారీగా డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు వెల్లడించారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసి జిల్లాలోని రేషన్ డీలర్ల సమస్యలను ఐక్యంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నూతన కార్యవర్గం కృషి చేయాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. డీలర్ల ప్రయోజనాలను పరిరక్షించే విధంగా సంఘం భవిష్యత్ కార్యాచరణకు సమావేశంలో రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు తప్పనిసరిగా సమావేశానికి హాజరై నూతన కార్యవర్గం ఏర్పాటు ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. తమ మండలాలకు సంబంధించిన సమస్యలను ముందుగానే గుర్తించి సమావేశంలో ప్రస్తావించాలని సూచించారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా కన్వీనర్ ఎం.డి. మునాఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంగలి నాగరాజు, జిల్లా మాజీ అధ్యక్షులు హన్వర్ పాషా, ఎన్నం సత్యనారాయణ గుప్తా, నాయకులు మార్కండేయ, చెన్నారెడ్డి, నారాయణ, చక్రపూర్ రాజు తదితరులు తెలిపారు.ఈ నెల 28న ఉదయం 11 గంటలకు టీఎన్జీవో భవన్‌లో జరిగే సమావేశానికి అన్ని మండలాల ప్రతినిధులు సమయానికి హాజరై విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# శ్రీనిధి రుణ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

నిధుల దుర్వినియోగం కేసులపై చర్యలు తీసుకోవాలి:

అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

శ్రీనిధి పథకాల కింద పంపిణీ చేసిన రుణాల బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం శ్రీనిధి పథకాలపై రిసోర్స్ పర్సన్స్ (ఆర్.పి.)తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీనిధి పథకాల అమలు, రుణాల పంపిణీ, బకాయిల వసూళ్ల పురోగతిని అదనపు కలెక్టర్ సమీక్షించారు. ముఖ్యంగా నిధుల దుర్వినియోగానికి సంబంధించిన కేసులు, వసూలు కాని రుణ బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న రుణ మొత్తాలను రికవరీ చేసేందుకు అధికారులు, ఆర్.పి.లు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. శ్రీనిధి పథకాల లక్ష్యాలను సమర్థవంతంగా సాధించేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు.




# బ్రహ్మోస్ ప్రాజెక్టుపై ముందడుగు.. రైతులతో జీఎంఆర్ చర్చలు

## - భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షల పరిహారం : ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**



దేవరకద్ర నియోజకవర్గంలో ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ క్షిపణి తయారీ యూనిట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియలో మరో ముందడుగు పడింది. భూసేకరణకు సంబంధించి రైతులతో నెగోషియేషన్ కమిటీ సమావేశం శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించారు.సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి (జీఎంఆర్), జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, సంబంధిత అధికారులు, బసాయిపల్లి, చౌదర్పల్లి, జీనుగురాల గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ రైతులతో నేరుగా చర్చించి భూసేకరణకు సంబంధించిన సమస్యలు, వారి అభ్యంతరాలు, పరిహార అంశాలను అడిగి తెలుసుకున్నారు. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.రైతులకు ఎకరాకు రూ.20 లక్షల పరిహారం అందించేలా నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే జీఎంఆర్ తెలిపారు. కొడంగల్ ప్రాంతంలో అందిస్తున్న పరిహారం తరహాలో దేవరకద్ర రైతులకు కూడా మెరుగైన పరిహారం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరినట్లు, దీనిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చే రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.బ్రహ్మోస్ వంటి జాతీయ స్థాయి రక్షణ రంగ ప్రాజెక్టు దేవరకద్ర ప్రాంతానికి రావడం ద్వారా పారిశ్రామిక అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడే అవకాశం ఉందని జీఎంఆర్ తెలిపారు. ప్రాజెక్టుతో పాటు అనుబంధ పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశం ఉండటంతో ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, పరిశోధన, రవాణా, హోటళ్ల తదితర రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు. పెద్ద రక్షణ పరిశ్రమ ఏర్పాటుతో ప్రాంతంలో మౌలిక సదుపాయాలు, ముఖ్యంగా రహదారుల అభివృద్ధికి కూడా అవకాశం



ఉంటుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చితే దేవరకద్ర ప్రాంతం రక్షణ పరిశ్రమలకు కీలక కేంద్రంగా ఎదిగే అవకాశం ఉందన్నారు. బ్రహ్మోస్ ప్రాజెక్టు కోసం దేశంలోని పలు రాష్ట్రాలు ఆసక్తి చూపిన నేపథ్యంలో, పాలమూరు ప్రాంతానికి ఈ ప్రాజెక్టును తీసుకురావడంలో ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో పాటు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర రక్షణ శాఖతో జరిగిన సంప్రదింపులు కీలకంగా నిలిచాయని ఎమ్మెల్యే తెలిపారు. అయితే ప్రాజెక్టు భూసేకరణలో రైతుల ప్రయోజనాలు, పరిహారం, ఇతర పునరావాస అంశాలపై సమగ్రంగా చర్చించి ముందుకు వెళ్లాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యం

**-ఎమ్మెల్యే డాక్టర్.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి**

**-విద్యతోపాటు మానవీయ విలువలు పెంపొందించాలి**

**-డి.ఈ.ఓ రమేష్ కుమార్**

**-ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి**

**-రూప్ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్**





**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి)**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యాబోధనతోపాటు వ్యక్తిత్వవికాసం,మానవీయవిలువలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని,విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని ఎమ్మెల్యే డాక్టర్. కూచకుళ్ళ రాజేష్ రెడ్డి అన్నారు. శనివారం నాగర్కర్నూల్ జిల్లా కేంద్రంలోని వెలుమఫంక్షన్ హాలు లో రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండితపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ దినోత్సవ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై హిందీ ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతూ,విద్యార్థుల్లో భాషా నైపుణ్యాల పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని,భాషల పరిరక్షణతోనే సంస్కృతి,సంప్రదాయాలు భావితరాలకు అందుతాయని,ఈ దిశగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో కృషి చేయాలని విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతోపాటు వారిలోని మంచి ఆలోచనా విధానం,క్రమశిక్షణ,నైతిక విలువలు,సామాజిక బాధ్యతను పెంపొందించేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలన్నారు.విద్యార్థుల్లో హిందీ భాషపై ఆసక్తి,అభిరుచి పెంపొందించేలా బోధనా పద్ధతులను మరింత సరళంగా,ఆకర్షణీయంగా రూపొందించాలని,కేవలం మార్కులసాధనకే విద్య పరిమితంకాకుండా,మంచి విలువలు,బాధ్యతాయుతమైన ఆలోచన,సామాజిక స్పృహ కలిగిన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే విద్య యొక్క ప్రధాన లక్ష్యమని అన్నారు.ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందనిఉపాధ్యాయులు ప్రభుత్వానికి కొంత సమయం, సహకారం అందించాలన్నారు.హిందీభాష అభివృద్ధికి,విద్యార్థుల్లో భాషా నైపుణ్యాల పెంపుకు కృషి చేస్తున్న హిందీ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే అభినందించి సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు తమ పాత్రను బాధ్యతా యుతంగా నిర్వర్తించాలన్నారు.అనంతరం జిల్లా విద్యాధికారి ఏ.రమేష్ కుమార్ హిందీభాష ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించడంతోపాటు దేశంలోని వివిధ భాషలు, సంస్కృతులపట్ల గౌరవ భావనను పెంపొందించే లా విద్యార్థులను తీర్చిదిద్దాలని అన్నారు.జిల్లాలో పదో తరగతి ఫలితాల్లో హిందీ సబ్జెక్టులో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేసిన హిందీ పాధ్యాయులను అభినందించి విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంతోపాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని అన్నారు.రూప్ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్ మాట్లాడుతూ హిందీ భాష అభివృద్ధితోపాటు విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు హిందీ ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని, భాషా పండితులు,ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.హిందీ సబ్జెక్టులో ఉత్తమ ప్రతిభకనబరిచిన హిందీ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే,డీఈఓ చేతుల మీదుగా సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేసి ఉపాధ్యాయుల సేవలను అభినందిస్తూ వారి కృషి విద్యార్థుల భవిష్యత్ నిర్మాణానికి దోహదపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు,రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్,హరూన్,ఎం.డి బురహన్,షాకిర్,పాషా,జహంగీర్,నాగేశ్వర్రావు,రూప్ల నాయక్,సాజిద్,శ్రీనివాసులు, వెంకటరాజు, బసవయ్య,కురుమూర్తి,రాజు నాయక్,హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# గణపతి నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

- ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా ప్రజలు సహకరించాలి

- జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్

**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన గణపతి నిమజ్జన వేడుకల్లో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ముఖ్యఅతిథిగా పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గణేష్ నిమజ్జన వేడుకలను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో,స్నేహపూర్వకంగా జరుపుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గణేష్ నిమజ్జన వేడుకలు శాంతియుతంగా జరిగేలా పట్టణ ప్రజలు పోలీసు,రెవెన్యూ అధికారులకు సహకరించాలని భక్తులు,నిర్వాహకులు నిమజ్జన సమయంలో ప్రభుత్వ నిబంధన లను పాటిస్తూ,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకు



# వినాయకుడికి ప్రత్యేక పూజలు.. అన్నదానంలో పాల్గొన్న ఏపి మిథున్ రెడ్డి

- పలు వినాయక మండపాల్లో పూజలు..

భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డింపు

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపి మిథున్ రెడ్డి నగరంలోని పలు వినాయక మండపాలను సందర్శించి విఘ్నేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేష్ ఉత్సవ సమితి, క్లాక్ టవర్, రామ్ మందిర్ చౌరస్తా, వీరన్నపేట్, టీడీ గుట్ట తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, శాంతి, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని గణనాథుడిని ప్రార్థించారు. అనంతరం హమాలి సంఘం, రామ్ మందిర్ చౌరస్తా, టీడీ గుట్ట ప్రాంతాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో ఏపి మిథున్ రెడ్డి పాల్గొన్నారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించి, వారితో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఘ్నేశ్వర స్వామివారి ఆశీస్సులతో ప్రజల కష్టాలు, విఘ్నాలు తొలగి ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో పాటు సామాజిక ఐక్యత, సోదరభావం, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవతా విలువలను మరింత పెంపొందిస్తాయని, భక్తులకు సేవ చేసే అవకాశం లభించడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# గణనాథుడి సన్నిధిలో ఆనంద్ కుమార్ గౌడ్

## - నగరంలోని పలు వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు..

## ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థనలు

మొదటిపేజీ తరువాయి

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో భక్తుల సందడి నెలకొంది. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 49వ డివిజన్ పరిధిలోని శేషాద్రి నగర్‌తో పాటు బయమ్మ తోట, రాజేంద్రనగర్, కిసాన్ నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఆయన సందర్శించి శ్రీ బొజ్జ గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గణనాథుడిని దర్శించుకుని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. అనంతరం ఆయా మండపాల నిర్వాహకులు, భక్తులతో కలిసి ఉత్సవ కార్యక్రమాల్లో పాల్గొని వారితో ముచ్చటించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గోటూరి రాజు, రామ్ నరేష్, కర్ణం రవి, దీపక్, భాను, అఖిల్ రాజ్, తీర్థ వర్ధన్ గౌడ్ తదితరులతో పాటు ఆయా వినాయక మండపాల నిర్వాహకులు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# విఘ్నేశ్వరుని దర్శించుకున్న మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్

## మాజీ జడ్పీటీసీ బాసు శ్యామల హనుమంతు నాయుడు

**ఆలంపూర్ సెప్టెంబర్ 19(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డు బురద పేటలో గణపతి ఉత్సవాల్లో భాగంగా మున్నూరు కాపు యూత్ సభ్యులు ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాథుడిని దర్శించుకుని,కొబ్బరికాయ కొట్టి, హారతి ఇచ్చి,ప్రత్యేక పూజలు నిర్వహించి,తీర్థ ప్రసాదాలు స్వీకరించి, స్వామి వారి ఆశీస్సులను పొందారు.అనంతరం,కమిటీ సభ్యులు వారిని శాలువాతో సత్కరించారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు..వినాయక చవితి పర్వదినం ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావం, సేవా స్ఫూర్తిని పెంపొందించాలని ఆకాంక్షించారు..ప్రజల జీవితాల్లో ఆనందం, శాంతి, అభివృద్ధి వెల్లివిరియాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు..వచ్చే ఏడాది ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్టించాలి.ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుని పూజించాలి పర్యావరణాన్ని కాపాడాలి అని తెలిపారు... విఘ్నేశ్వరుని ఆశీస్సులతో పట్టణ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ,పాడిపంటలతో సుఖ సంతోషంగా ఉండాలని వారు ఆకాంక్షించారు..ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పులిపాటి వెంకటేష్,మోహన్ యాదవ్,నరసింహులు,చిత్తారి కిరణ్, తిరుమలేష్, రామ్మోహన్ యాదవ్,వినయ్, మహేందర్, నరేష్,మోహన్, భాస్కర్, రామకృష్ణ,మరియు నాయకులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు....



# కేసుల త్వరితగతిన పరిష్కారం

## - బాధితులకు వేగవంతమైన న్యాయమే లక్ష్యం

## - జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్

**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 19(ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్ జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమాకాంత్ అధ్యక్షతన కోర్ట్ కోఆర్డినేషన్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులు, కోర్టులో విచారణలో ఉన్న కేసుల పురోగతి,కోర్టు వ్యవహారాలపై చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ మాట్లాడుతూమహిళలపై అక్రమాలు,సైబర్ నేరాలు మరియు తీవ్రమైన నేరాల్లో శాస్త్రీయ మరియు ఫోరెన్సిక్ సాక్ష్యాధారాలతో నిర్ణీత గడువులోగా కోర్టులో ఛార్జ్‌షీట్‌లను సమర్పించాలని,నేరస్థులకు తగిన శిక్ష పడేలా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మరియు కోర్ట్ లైజన్ ఆఫీసర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అలాగే కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన విచారణ పూర్తి చేసి బాధితులకు సకాలంలో న్యాయం అందేలా అధికారులు,సిబ్బంది కృషి చేయాలని,నిందితులపై ఉన్న నాన్-బెయిలబుల్ వారెంట్లను వేగంగా అమలు చేసి సమయానికి కోర్టులో హాజరుపరచాలని ఆదేశించారు.ఇటీవల కేంద్ర ప్రభుత్వం,న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతంచేసిన పోలీ సు అధికారులను,సిబ్బందిని ఎస్.పి. ప్రత్యేకంగా ప్రశంసించారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు,జిల్లా డీఎస్పీలు బుర్రి శ్రీనివాసులు, సాయి వెంకట్ రెడ్డి,సీఐ లు అశోక్ రెడ్డి,శంకర్, ఎస్సైలు వెంకట్ రెడ్డి,రమేష్,రాములు,అభిషేక్ రెడ్డి,కోర్ట్ డ్యూటీ పోలీసు సిబ్బంది పిపిలు పాల్గొన్నారు.



# శ్రీశైలం నిర్వాసితుల గోడు.. కేటీఆర్‌కు వినతిపత్రం

## ‹98 జీవో పరిధిలో 2 వేల ఉద్యోగాలు కల్పించాలి ‹ఏళ్ల తరబడి ఎదురుచూపులు.. చాలామంది మృత్యువాత

## ‹అసెంబ్లీలో సమస్యను లేవనెత్తాలని భారీ సంఖ్యలో నిర్వాసితుల విజ్ఞప్తి

**చిన్నంబావి, సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి)**

శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యను పరిష్కరించి, 98 జీవో పరిధిలో ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ నిర్వాసితులు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వినతిపత్రం అందించారు. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నామని, నిర్వాసిత కుటుంబాల్లో చాలామంది ఉద్యోగాల ఆశతోనే మృత్యువాత పడ్డారని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా మా శ్రీశైలం నిర్వాసిత కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలని, నిర్వాసితుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కేటీఆర్‌ను కోరారు.

### భారీ సంఖ్యలో తరలివచ్చిన నిర్వాసితులు

చిన్నంబావి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అభిలాష్‌రావు ఆవరణలో కేటీఆర్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను శ్రీశైలం 98 జీవో నిర్వాసితులు భారీ సంఖ్యలో కలిసి తమ సమస్యలను వివరించారు. 98 జీవో కింద 2 వేల మందికి ఉద్యోగాలు కల్పించాల్సి ఉందని, ఈ అంశాన్ని అసెంబ్లీలో బలంగా లేవనెత్తి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు.

### 'ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూనే ఉన్నాం'

శ్రీశైలం ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు కోల్పోయి నిర్వాసితులుగా మారామని బాధితులు తెలిపారు. పునరావాసం, ఉద్యోగాలపై ఎన్నో ఏళ్లుగా ఆశతో ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ ఇప్పటికే అనేక కుటుంబాల్లో పెద్దలు, అర్హులైన యువకులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాల్లో మిగిలిన వారికి అయినా ఉద్యోగాలు కల్పించి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు.

### 'ఇకనైనా మా చావులను ఆపండి'

"ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నాం.. మా కళ్ల ముందే ఎంతోమంది నిర్వాసితులు చనిపోయారు. ఇకనైనా మా కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలి. నిర్వాసితుల కష్టాలకు ముగింపు పలకాలి" అంటూ కేటీఆర్ ఎదుట తమ గోడును వెళ్లబోసుకున్నారు. 98 జీవో అమలుకు చర్యలు తీసుకుని నిర్వాసిత కుటుంబాలకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

### కేటీఆర్ సానుకూల స్పందన

నిర్వాసితులు వివరించిన సమస్యలను కేటీఆర్ సానుకూలంగా విన్నారని, 98 జీవో నిర్వాసితుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, అసెంబ్లీలో ప్రస్తావించే విషయంపై సానుకూలంగా స్పందించారని నిర్వాసితులు తెలిపారు. తమ సమస్యను ఓపికగా విని స్పందించిన కేటీఆర్‌కు నిర్వాసితులు కృతజ్ఞతలు తెలిపారు.



